# ధర్మక్షేత్రే...!

"క్షాత్ర ధర్మం, రాజధర్మం అని పట్టుక్కూచున్న భీష్ముడికేం మిగిలింది? చెప్పు బ్రహ్మచర్యం కాదా!

ప్రాణ, విత్తస, మాన భంగమందు / జకిత గోకులాగ్ర జన్మరక్షణ మందు అబద్ధం పాపం కాదు అని శుక్రాచార్యుల వారు ఓ మూల నుంచి చెప్తున్నా నేను మానధనుడను, ధర్మం తప్పను అన్న బలిగారికేఁవయింది? అథః పాతాళం కాదా!

అసలు రాఁవులారికి, రావణాసురుడికి యుద్ధం ఎందుకొచ్చింది? రాఁవులారు లేనప్పుడు సీతమ్మ నెత్తుకెళ్ళినందుకే కందా! అవుతే రాఁవులారు లంకకెళ్ళారు. లంకనిమ్మని అడగలేదు. బంగారం అడగలేదు. మళ్ళూ మాన్యాలడగలేదు. నా సీతమ్మని నాకిచ్చేయమన్నాడు ఛవ్! నువ్వడగ్గానే ఇచ్చేయ్యడమేనా! నేనీను పొమ్మన్నాడు. అంతే రామ రావణ యుద్ధం అయిందా లేదా!

అంచేత..." నా మాట ఇంకా పూర్తికాలేదు.

"ఈ ధర్మా ధర్మ యుద్ధాలు కొత్తేం కాదు సత్యయుగం నుంచి ఉందంటావ్! అవునా! అదేనా నీ పాయింటు!" అన్నాడు బిస్మార్క్.

బిస్మార్క్ అంటే ఏ జర్మనీవాడో అని అనుకుంటే పొరపాటే. దొడ్డారం గోదారొడ్డునున్న అదుర్రులో పుట్టి పెరిగిన నూరుపైసల కోనసీమ వాడు.

మరి ఆయనకి జర్మనీ ఛాన్సలర్ పేరు ఎందుకు పెట్టారు? ఎవరు పెట్టారు? ఆయన అసలు పేరేఁవిటీ? అన్న ప్రెశ్నలు రావచ్చు.

బిస్మార్క్ అసలు పేరు పళ్ళాల శర్మ. వానపల్లి పళ్ళాలమ్మ గుళ్ళో, అరటిపళ్ళ అత్తాలు అమ్మవారికిచ్చాక, పుట్టిన మొగ నలుసు అంచేత పళ్ళాల శర్మ అని పేరు పెట్టారు.

మేము అద్దుర్రులో ఎలిమెంట్రీ బళ్ళో చదువయ్యాక, ఈదరాడలో చదువుకున్నాం. హైస్కూలు చదువు కోసం మాఁవిడి కుదురు కెళ్ళాం. అక్కడ భీమశంకరంగారు మాకు సోషల్ చెప్పేవారు. ఆయనే పళ్ళాల శర్మకి బిస్మార్క్ అన్న పేరు పెట్టారు. కారణం కూడా చెప్పారు.

బిస్మార్క్ జర్మన్లందరినీ, ఒక్క తాటికిందికి ఎలా తెచ్చాడో, స్వాతంత్ర్యం వచ్చాక, చిన్న చిన్న రాజ్యాల్ని కేంద్రంలో కలవడానికి, ఒకే ప్రభుత్వం కింద ఉండడానికి, మన దేశంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్, అలాగే కష్టపడ్డాడు. అందుకని పటేల్‌ని బిస్మార్క్ అని-అనే వారుట. పళ్ళాల శర్మ మొహం అచ్చు సర్దార్ పటేల్ లాగా ఉంటుందని, మేష్టారు మొదట్లో సర్దార్ అని, పటేల్ అని పిలిచినా, రాన్రాను బిస్మార్క్ అన్న పేరుతోనే పిలవడం వల్ల, స్కూల్లో అంతా అలాగే పిలవడం వల్ల, అదే పేరు సార్థకం అయిపోయింది. అదీ బిస్మార్క్ పేరు వెనక ఉన్న కథ.

ఇప్పుడు ఆ బిస్మార్క్‌కి జర్మనీలో బెర్లిన్ గోడ కట్టడానికి ముందున్న టెన్షన్ లాంటిదొచ్చింది. ఇప్పుడా పనిమీదే మా ఇంటికొచ్చాడు. కారణం బెంగళూరులో ఉన్న పుత్రరత్నం, వాడు అన్న మాటలు.

"నేనో అమ్మాయిని ప్రేమించాను. పెళ్ళి చేసుకోవాలని కూడా నిశ్చయించుకున్నాం. పెద్ద తరహాగా ఆశీర్వదించి, మా పెళ్ళి చేయండి, లేకపోతే రిజిస్టరు పెళ్ళి చేసుకుంటాము. ఇప్పుడుంటున్న ఇల్లు, పెళ్ళయ్యాకా మాకు సరిపోదు కాబట్టి, పెద్ద ఫ్లాట్‌లోకి మారాలనుకుంటున్నాను. అద్దె కట్టడం దండగ అని, కొందామని అనుకుంటున్నాను. ఓ ముప్ఫయి లక్షలు పంపు. ప్రతీసారి నే డబ్బడగడం, నువ్వు లేదనడం జరుగుతోంది అందుకని అలవాటుగా డబ్బు లేదనకుండా, ఎకరాలు అమ్మి అయినా ఇవ్వు. నా వాటా నాకిచ్చినా పర్వాలేదు. కాదూ కూడదూ అంటే కోర్టు కెళ్తాను."

ఇదీ టెన్షన్‌కి కారణం.

"వీడిలా బెదిరించాడా! మొన్న మా కావేఁసరమ్మ, మాణిక్యం తోచ్చి

వడ్డాణం అమ్మేస్తోందిట, ఇది కొనుక్కుని, ఆ కొత్త కోడలికి పెళ్ళినాడు కట్టబెడ్తుందిట. రెండు లక్షలిస్తారా, ఛస్తారా అన్న అర్థం వచ్చేట్లు మాట్లాడింది.

ఏదైనా అడగాలంటే వొడియం ముక్కలా వొంకర్లు పోతూ భయపడిపోయే ఈ పీనుక్కి కూడా అలుసయిపోయాను. ఇద్దరు చెరోవైపు నుంచి మద్దెల వాయిస్తున్నా రనుక్కో డబ్బు చెట్లకి కాయవు, కష్టపడితేనే వస్తాయన్న యింగిత జ్ఞానం ఉండద్దూ! పొలాలు కౌలుకి తీసుకుని, డబ్బు వడ్డీలకి తిప్పి, సంపాదించిన ఆస్తి ఇది. ఈ పీను గలకేం తెలుసు డబ్బు సంపాదన! పైసా పైసా కూడపెట్టి ఇంత ఆస్తిని పోగుచేశాను...”

బిస్మార్క్ పరమ లోభి. ఖర సంవత్సరం అంతా కాకి గూళ్ళతోనే ఇంటి వంట జరిపించిన సింగరాజు అంశ ఉన్నవాడు అన్న అపఖ్యాత కూడా ఉంది. వాడితిట్ల ప్రవాహానికి కట్టవేయడం తప్పనిసరి. లేకపోతే, ఆ తర్వాత సంస్కృతమే వాడతాడు.

“ఛ! ఊర్కో – మంగళారం పూట ఇల్లాల్ని తిట్టకు. అసలు ఇల్లాలు అంటే ఎవరు? ధర్మపత్ని. ధర్మపత్నుల్నంటే శాస్త్రాలొప్పవ్...”

“సరేలే... అదేదో సామెత చెప్పినట్లుంది. ధర్మ పత్నులు పతివ్రతా ధర్మం పాటించాలి కానీ, మొగుడు కిష్టం లేని పన్లు చెయ్యడం, కొడుకు పెళ్ళి చేసుకుంటానంటే కొడుక్కి వత్తాసివ్వడం కాదు, ఎడ్డెం తడ్డెంలా మాట్లాడ్డం కాదు. అన్నీ అధర్మాలే కదా...”

“ఎటో వెళ్ళిపోతున్నావ్? తక్షణం చేయాల్సిందేంవిటో ఆలోచించు...”

“అందుకే కదా, నీ దగ్గరికొస్త... ఏదో సలహా ఇవ్వు...”

“అడగడం వాడి హక్కు అని అనుకుంటున్నాడు. ఇవ్వడం నీ ధర్మం”

“ఉరే బావా ఇదేనా నువ్విచ్చే చచ్చున్నర సలహా! హుఁ...”

“నీ ఇష్టం నువ్వేంవన్నా సరే... ఒహడి ధర్మం మరొహడి కధర్మం అవుతోంది. దానికి ఎగ్జాంపుల్స్ ఇచ్చాను. అవునా! నీ కొడుకు ఈయమంటున్నాడు. నువ్వీయనంటున్నావు. ఇది ధర్మయుద్ధం.

ఈ ధర్మయుద్ధం నీ ఇంట్లోనే కాదు, ప్రపంచం అంతా ఉంది. అన్ని రాజకీయ పార్టీలు, సమాజాన్ని ఉద్ధరిస్తామనేవాళ్ళు, గుండాలు, బద్మాష్‌లు, వీరూ వారూ అని తేడా లేదు. అంతా స్వేచ్ఛానుసారంగా, ఇష్టానుసారంగా ధర్మాన్ని అనుసరిస్తున్నవారే. ఎవరి ధర్మం వాళ్ళది.

ఈ రాజకీయ పార్టీలన్నీ కూడా ధర్మం తోక పట్టుకుని వైతరణి దాటడానికే ప్రయత్నిస్తుంటాయి.

ఓట్లు ధర్మం చేయడంటూ యాచక వేషం వేయడం రాజకీయ ధర్మం అయిపోయింది.

అంతెందుకు, నీ సీనియర్ సింగరాజు, 'తిండి యొక పక్క వెలితిగా తినవలయు, చెప్పకనే పనులెల్ల చేయవలయు' అని ఆయన తన కోడలి ధర్మం ఏంవిటో చెప్పాడు. మరి ఆ ధర్మం అందరికీ చెల్లదు. తనక్కుడా చెల్లదు.

మన చిన్నప్పుడు ఆడవాళ్ళు బళ్ళోకెళ్ళడం అప్రాచ్యం. అధర్మం. పెళ్ళిళ్ళ పేరయ్యగారు అస్తమానం అంటూంటారు. మా పెంకి ముండ బళ్ళోకి వెళ్ళడానికి సిద్ధపడితే స్థంభానిక్కట్టేసి చావగొట్టాను. అంతే టక్కున రోగం కుదిరింది. ఐదుగురి పిల్లల తల్లయింది. అది ధర్మం అనుకున్నాడు.

ఈ ధర్మా ధర్మ యుద్ధాలు భూంవి పుట్టిన్నాటి నుంచి ఉన్నాయి. ఇవాళ కొత్త కాదు. నీకు నచ్చింది ధర్మం. నువ్వు చేసింది ధర్మం. అంగబలం, అర్థబలం, స్థానబలం ఉంటే నీ ధర్మం చెల్లుతుంది. లేకపోతే అధర్మం అవుతుంది....."

దిగ్గున లేచాడు బిస్మార్క్

"ఏం అప్పుడే లేచావేం?"

"నీ గీత బాగా అర్థం అయింది. ఏం చేయాలో తెలుసుకున్నాను. నాకు నచ్చింది చేస్తాను....."

తెల్లబోయాను... "అంటే?"

"ఆస్తి నా స్వార్జితం – నయాపైసా ఇవ్వను. నీ దిక్కున్న చోట చెప్పుకో.

ఇల్లే కావాలనుకుంటే, లోను తీసుకో, కూడబెట్టుకో... నీ యిష్టం ఏదైనా చెయ్యి. డబ్బుని జాగ్రత్తగా కూడబెట్టడం నీ ధర్మం..."

"అలా కాదు – కోర్టుకెళ్ళడం నా ధర్మం అని నీ కొడుకుంటే..."

నా మొహంలోకి చూసి నవ్వాడు.

"ఈ ధర్మ యుద్ధానికి పరిష్కారం జడ్జీగారు చూసుకుంటారులే. అక్కడో ధర్మకాంటా ఉందిగా....."

(పత్రిక 2007 దీపావళి ప్రత్యేక సంచిక)

కథా నిలయం
శ్రీకాకుళం